క్లుప్తంగా

ఓటింగ్ శాతం పెంపునకు కృషి



కడియంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన పోలీస్ అబ్జర్వర్ బలరాం మీనా

కడియం: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని, ఓటింగ్ శాతం పెంపునకు కృషి చేయాలని జిల్లా పోలీస్ అబ్జర్వర్ బలరాం మీనా ఆదేశించారు. కడియం, బుర్రిలంక, మాధవరాయుడుపాలెం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. శాంతియుత వాతావరణంలో అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది ఈ మేరకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తననే సంప్రదించవచ్చునన్నారు. ఆయన వెంట దక్షిణ మండలం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, ఎస్సై టి.కృష్ణసాయి, పోలీసు సిబ్బంది, సెక్టర్ ఆఫీసర్ సుదీర్ కుమార్, బూత్ లెవెల్ ఆఫీసర్లు, ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సెబ్ అధికారుల విస్తృత దాడులు



సారా, నిందితుడితో సెబ్ సౌత్‌స్టేషన్ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు గురువారం సెబ్ రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ,, సిబ్బందితో కలిసి సారా తయారీ కేంద్రాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు కేసులు నమోదు చేసి, 25 లీటర్ల సారా, 180 ఎంఎల్ 12 డ్యూటీ ఫైడ్ లిక్కర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. రాజానగరం మండలం పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన మార్గాని పోసికృష్ణ, జి.ఎర్రంపాలేనికి చెందిన గండిమేను సంధ్యారాణిలను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. ఎన్నికల సందర్భంగా రహస్య ప్రదేశాలలో నిల్వ ఉంచిన మద్యం నిల్వలపై సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 14500కి తెలియజేయాలన్నారు.

క్రీడలకు అన్ని విధాలా ప్రోత్సాహం



ఇంటర్నేషనల్ యోగా జడ్జిగా ఎంపికైన శ్రీధర్ రెడ్డిని అభినందిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

ప్రకాశం నగర్: క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించేందుకు రాజమహేంద్రి స్పోర్ట్స్ అకాడమీ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని అకాడమీ చెర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంటర్నేషనల్ యోగా జడ్జిగా ఎంపికైన కర్రి నాగ వెంకట శ్రీధర్ రెడ్డి, స్టేట్ జడ్జిగా ఎంపికైన హేమ నిర్మలారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ శ్రీధర్ రెడ్డి ఇప్పటికే గిన్నిస్‌బుక్ రికార్డు సాధించారని, అంతర్జాతీయ స్థాయిలో యోగా పోటీలకు జడ్జిగా ఎంపికై శిక్షణ పొందడం గర్వకారణంగా ఉందన్నారు. స్పోర్ట్స్ గేమ్స్, యోగాలో ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు తమను సంప్రదిస్తే సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సమావేశంలో ఎల్‌వీ రామారావు, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓబీసీల అభ్యున్నతికి ప్రధాని మోదీ కృషి

రాజమహేంద్రవరం సిటీ: ఓబీసీల అభ్యున్నతికి కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపిశ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్ర విద్యాసంస్థల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీ సాధికారత దిశగా పని చేస్తుందన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సంసాని ప్రసాద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జోరు.. టీడీపీ బేజారు

- ప్రచారంలో దూసుకుపోతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ
- అన్ని గ్రామాల్లో ఆత్మీయ స్వాగతం
- కనిపించని సైకిల్ జోరు
- నియోజకవర్గంలో స్పష్టమైన మార్పు



ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు నమస్కరిస్తున్న మంత్రి వేణు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: రాజకీయంగా చైతన్యం కలిగిన నియోజకవర్గాల్లో ఒకటిగా నిలిచే రాజమహేంద్రవరం రూరల్‌లో వైఎస్సార్ సీపీలో గెలుపు జోరు కన్పిస్తోంది. అదే సమయంలో టీడీపీ, జనసేనల మధ్య సమన్వయ లోపంతో ఆయా పార్టీల శ్రేణుల్లో బేజారుతనం స్పష్టమవుతోంది. క్షేత్రస్థాయిలోని పరిస్థితులను పరిశీలిస్తే ఇది నిజమేనని తెలుస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో జరిగిన నష్టాన్ని గుర్తించిన వైఎస్సార్ సీపీ శ్రేణులో ఈ సారి రూరల్‌లో విజయం దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉంది. అగ్నికి వాయువు తోడైనట్లుగా కార్యకర్తల పట్టుదలకు రూరల్ కో ఆర్డినేటర్‌గా చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రావడం మరింత ఊపును తీసుకువచ్చింది. ఆయన వచ్చిన మూడు నెలలలోనే పార్టీ శ్రేణులను కలుపుకొని కార్యాచరణ రూపొందించుకోవడంతో పాటు పార్టీ బలం, బలహీనతలపై స్పష్టమైన అవగాహనతో ముందుకు వెళ్లారు. అదే సమయంలో గ్రామాల్లో వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువకాగలిగారు. పార్టీ శ్రేణులకు పనులు అప్పజెప్పి ఊరుకోకుండా, నేరుగా తాను కూడా వారితో కలిసి కార్యాచరణ అమలుకు సిద్ధమయ్యారు.

ఉత్సాహంగా ప్రచారం

ఒకప్పుడు తటస్థంగా మారిపోయిన కీలక నాయకులు కూడా ఇప్పుడు ఉత్సాహంగా ముందుకు వచ్చి పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తున్నారు. పార్టీ ఏర్పాటు చేసిన బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థ సహకారంతో ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరించి, మేలు జరిగితేనే ఓటు వేయండి అంటూ ధైర్యంగా అడుగుతున్నారు. అలాగే గ్రామాల వారీగా మేనిఫెస్టో తయారీ చేసి చేపట్టబోయే పనులను ప్రజలకు ముందస్తుగానే వివరిస్తున్నారు. పార్టీ విధానం, వేణు చొరవను గమనించిన రూరల్ ఓటర్లు ఎక్కడికక్కడే స్వచ్ఛందంగా పార్టీ ప్రచార కార్యక్రమాలకు ముందుకు వస్తున్నారు. ఇది పార్టీ కేడర్‌ను మరింత ఉత్సాహపరుస్తోంది. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారుల మన్ననలు, సైనికులా మాదిరిగా పనిచేసే పార్టీ శ్రేణులు వైఎస్సార్ సీపీ బలాన్ని మరింత పెంచుతున్నాయి. టీడీపీకి పట్టున్న ప్రాంతాల నుంచి సైతం వేణు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి వలసలు పెరిగాయి. వేణుపై రూరల్ ఓటర్లలో ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది.

మంత్రి వేణుకు ప్రజల ఆదరణ

2014లో ఎమ్మెల్యేగా గెలిచాక ఇసుక దోపిడీ, నీరు – చెట్టు పథకంలో దోపిడీ, రాజమహేంద్రవరం సిటీ పరిధిలోని పలు అభివృద్ధి పనుల్లో కమీషన్లు.. ఇలా గతంలో గోరంట్ల చేసిన ప్రతి అవినీతిని గురించి కూడా ప్రజలు చర్చించుకుంటున్నారు. గెలిస్తే అమెరికా వెళ్లిపోయే గోరంట్ల కావాలా? మన మధ్యే అంటూ, మన బాగోగులు చూసే చెల్లుబోయిన వేణు కావాలా? అన్న ప్రచారం కూడా ఓటర్లను ఆలోచింపజేస్తోంది. పెత్తందారీ పోకడలతో వ్యవహరించే గోరంట్లకు, వెనుకబడిన సామాజికవర్గాలకు ప్రతినిధిగా ఉన్న చెల్లుబోయిన వేణులను ఓటర్లు బేరీజు వేసుకుంటున్నారు. తద్వారా అత్యధికశాతం మంది వేణు వైపే మొగ్గు చూపుతున్నారు.

కూటమిలో విభేదాలు

టీడీపీ, జనసేన కూటమిలో భేదాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. 2019 ఎన్నికల్లో కనిపించిన గోరంట్ల బుచ్చయ్య చౌదరి అప్పట్నుంచి ఇప్పటి వరకు మళ్లీ కన్పించలేదు. దీంతో ఆయనను ప్రజలు నిలదీస్తున్న పరిస్థితి నెలకొంది. జనసేన పార్టీ నాయకుడు కందుల దుర్గేష్‌కు దక్కుతుందనుకున్న సీటును గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఎగరేసుకుపోయారన్న భావన జనసేన నాయకులు, కార్యకర్తల్లో బలంగా పాతుకుపోయింది. దుర్గేష్‌కు అన్యాయం జరిగింది అంటే అది కేవలం గోరంట్లే కారణమన్న ఉద్దేశానికి వారందరూ వచ్చేశారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడే ప్రజల నుంచి ఎదురు ప్రశ్నలను టీడీపీ కేడర్ ఎదుర్కొంటోంది. పార్టీలో చేరకలంటూ హడావుడి చేద్దామనుకున్నప్పటికీ ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో, అప్పటికే పార్టీలో ఉన్న వారి కుటుంబ సభ్యులకే టీడీపీ కండువాలు వేసి లేని హైప్‌ను సృష్టించేందుకు కూడా సిద్ధమైపోయారు.

టీడీపీ వస్తే రాష్ట్రంలో అంధకారమే



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ భరత్‌రామ్

- చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు
- ఎంపీ, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళుతుందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ రామ్ అన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని చంద్రబాబు చెబుతున్న మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. ఆయన గురువారం స్థానిక 2, 10వ డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న వస్తేనే రాష్ట్రంలో ప్రజలందరూ ప్రశాంతంగా జీవించగలరన్నారు. చంద్రబాబు వస్తే ఇప్పుడు జగనన్న అందించే సంక్షేమ పథకాలేవీ కొనసాగవన్నారు. ఆయన 2014 ఎన్నికలలో 640 హామీలిచ్చి వాటిలో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. జగనన్న 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఏమైతే హామీలిచ్చారో అంతకంటే ఎక్కువ చేసి చూపారన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు జగనన్న సంక్షేమ పాలన అందించారన్నారు. వడ్డీ వ్యాపారాలు, చీట్ల వ్యాపారాలు చేస్తున్న టీడీపీ అభ్యర్థిని చిత్తుగా ఓడించాలని పిలుపు నిచ్చారు. టీడీపీ నేతలకు కేవలం అధికారం మాత్రమే కావాలని, ప్రజల యోగ క్షేమాలు అక్కర్లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

ఎంపీ భరత్ వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా టీడీపీ నాయకులు జక్కా ఆదినారాయణ, కృష్ణ,మహేష్ అభిమాన సేవా సమితి సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి భరత్ రామ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కృష్ణ, మహేష్ అభిమాన సంఘ సేవా సమితి సభ్యులు కేఎస్వీ తనూజ్ మిత్ర బృందం, అయ్యప్ప, దుర్గా ప్రసాద్ (ధోనీ), నరేష్, ప్రిన్స్ రాజేష్, కె. మణికంత, కోమల రామ్ పాల్గొన్నారు.

మీకు సేవ చేసుకునే భాగ్యం కల్పించండి



బుచ్చియ్య నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, చందన నాగేశ్వర్

- ఓటర్లను అభ్యర్థించిన మంత్రి వేణు
- జోరుగా ఎన్నికల ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: తనను ఎమ్మెల్యేగా ఆదరించి, మీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఓటర్లను కోరారు. గురువారం రాత్రి ఆయన రాష్ట్ర పచ్చదనం మరియు సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ తదితరులతో కలిసి పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని బుచ్చయ్య నగర్, కవలగొయ్యి, పిడింగొయ్యి చెరువుగట్టు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలనతో ప్రజల హృదయాలలో జగనన్న నిలిచిపోయారన్నారు. రాష్ట్రంలో 66.7 లక్షల మందికి ప్రతినెలా పెన్షన్ల రూపంలో రూ.2,400 కోట్లు నేరుగా లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా అందజేయడం ఏ రాష్ట్రంలో లేదన్నారు. చంద్రబాబు నోరు విప్పితే అన్నీ అబద్ధాలు, మోసాలేనన్నారు. ఈ ఎన్నికలలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, జగన్ మళ్లీ సీఎం అవుతారన్నారు. రాజమండ్రి రూరల్‌లో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్న, జగనన్న సుపరిపాలన కావాలన్న త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వేణుగోపాలకృష్ణ, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రేలంగి సత్యనారాయణ, బొప్పన సుబ్బారావు, జాజుల శ్రీను, కందిరెల్లి సత్తిబాబు, వీరరాఘవరెడ్డి, ఇబ్రహీం బాషా, యర్ర శ్రీను, మేడి త్రిమూర్తులు, మాదబత్తుల రాజు, చిన్నం ఆనంద్, సియాద్రి శిరీషా, చీరా రాజు, సిరసపల్లి శంకరరావు, తీగిరెడ్డి శ్రీను, రేలంగి పెద్ద సత్యనారాయణ, ఎరికే దుర్గారావు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కడియం: మురమండ గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు గోవిందరాజుల చక్రపాణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. బొల్లోజు భాస్కరరావు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మురమండతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. మల్లికార్జున్ నగర్, భాస్కర్ నగర్, సుబ్రహ్మణ్యం నగర్, సువిశేషపురం, సీటీఆర్ఐ రోడ్డు, సెంట్రల్ జైల్ క్వార్టర్లు, ఎఫ్‌సీఐ గోడౌన్స్, ఆర్టీఓ ఆఫీస్ రోడ్డు, సైక్లోన్ కాలనీ పుంత, ఎస్‌బీఐ కాలనీ, సుబ్బారావుపేట ఏరియాలలో సరఫరా ఉండదన్నారు.

ఆర్థిక సాయం

ప్రకాశం నగర్: చిరు వ్యాపారి గంప కుమారస్వామి కుమార్తె ప్రత్యక్షవర్దిని మెదడు ఆపరేషన్ కోసం జవహర్ వాకర్స్ క్లబ్ సభ్యులు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఆపరేషన్ ఖర్చు విషయం తమ దృష్టికి వచ్చిందని, దీంతో క్లబ్ సభ్యుల నుంచి విరాళాలు సేకరించామని అధ్యక్షుడు వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మూర్తి, యోగా గురువు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



బొమ్మూరు మురళీకొండపై ప్రచారం చేస్తున్న శ్రీనివాసులురెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: రాబోవు ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను ఫ్యాన్‌గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు, న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి ఓటర్లను కోరారు. ఆయన గురువారం సాయంత్రం బొమ్మూరులోని మురళీకొండ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావాలంటే మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమిని నమ్ముకుంటే మునిగిపోతాం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- వేమగిరి, జేగురుపాడులో ప్రచారం



వేమగిరి జక్కంపూడి నగర్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కడియం: ప్రజలను మోసం చేయడానికి ఏకమైన కూటమిని నమ్మి ఓట్లు వేస్తే నట్టేట మునిగిపోతామని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియం మండలం వేమగిరి పంచాయతీ పరిధిలోని జక్కంపూడి నగర్, జేగురుపాడు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేనిఫెస్టోతో ఊదరగొడుతున్న చంద్రబాబు గతంలో ఎన్ని హామీలు నెరవేర్చారంటూ ప్రశ్నించారు. ఢిల్లీ వాళ్లతో కుట్రలు చేయిస్తూ పథకాలు ఆపుతున్నారని ఆయన ఆరోపించారు. 14 ఏళ్ల సీఎంగా పని చేసిన చంద్రబాబు పేరు చెబితే ఏ ఒక్క పథకం పేరైనా గుర్తొస్తుందా? అని ఆయన అన్నారు. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను జగన్ నెరవేర్చారన్నారు. రాబోయే ఐదేళ్ల భవిష్యత్తును ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే కరువును నిద్రలేపడమే అవుతుందన్నారు. టీడీపీకి ఓటు వేస్తే పతకాల ముగింపేనన్నారు. కార్యక్రమంలో యాదల సతీష్ చంద్ర స్టాలిన్, గిరజాల బాబు, బైరవరపు నాగేశ్వరరావు, చిలుకూరి రామకృష్ణ, మంచేటి సత్తిరాజు, కట్టా జమీందార్, వెలుగుబంటి అచ్యుతరామ్, తిరుమలశెట్టి శ్రీను, లావేటి రమేష్, బిల్లకుర్తి ముత్యాలరావు, చెల్లుబోయిన దుర్గాప్రసాద్, ఆకుల సుధాకర్ పాల్గొన్నారు.

భౌతిక శాస్త్ర ప్రయోగాలపై వేసవి శిక్షణ



పోస్టర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భౌతిక శాస్త్ర ప్రయోగాలపై వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి, అకడమిక్ సమన్వయకర్త డాక్టర్ సంజీవ్ కుమార్, అధ్యాపకుల సమక్షంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కోమల లక్ష్మి మాట్లాడుతూ 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ మొదట, ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి 11:30 వరకు భౌతిక శాస్త్రంలో మౌలిక అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కేవలం 50 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. కోర్సు, ఫీజు వివరాలకు కళాశాల భౌతిక శాస్త్ర వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. మరిన్ని వివరాలకు అధ్యాపకులు డాక్టర్ ఈసుబ్ బాషా 97059 64213, దుర్గాలక్ష్మి 94914 19667లను సంప్రదించాలన్నారు.

గోదావరిలో యువకుడి మృతదేహం



కంబాలచెరువు: పుష్కరాల రేవు వద్ద గోదావరిలో సుమారు 27 గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని మూడో పట్టణ పోలీసులు గురువారం గుర్తించారు. పుష్కర్ ఘాట్ సమీపంలోని బ్రిడ్జి కిందకు యువకుడి మృతదేహం కొట్టుకురావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికితీశారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో తెలపాలని కోరారు. ఎస్సై ఎస్ఎస్.రంగనాథుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీలో పసికందు..

కంబాలచెరువు: ఆర్యాపురంలోని సాయి ఆస్పత్రి వద్ద ఉన్న డ్రైనేజీలో గురువారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో పసికందు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన ఆడపిల్లను డ్రైనేజీలో పడేసినట్టు భావిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పసికందు మృతదేహాన్ని బయటకు తీసి, ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేశారు.

ఉపాధి, ఉద్యోగాల కల్పనకు కృషి

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే రూరల్ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని జై భారత్ నేషనల్ పార్టీ రూరల్ అభ్యర్థి మన్నవ రఘురామ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. భూహక్కు చట్టం వల్ల భూ యజమానులకు నష్టం జరుగుతోందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ చట్టం తెచ్చిందన్నారు.

మంత్రి బొత్స వ్యాఖ్యలకు ఖండన

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన మంత్రి నరేంద్రమోదీపై రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి ఖండించారు. రాజమహేంద్రవరం ఎన్నికల కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ అవినీతి చేసే వారికి అంతా అవినీతిమయంగానే కనిపిస్తుందని ధ్వజమెత్తారు.

సినిమాలు



శ్యామల : ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ : కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
సూర్యప్యాలస్ : ప్రతినిధి–2
స్వామి : కృష్ణమ్మ
శివజ్యోతి : గీతాంజలి మళ్ళీ వచ్చింది
అనుశ్రీ : లక్ష్మీకటాక్షం
రాజా : రత్నం
ఊర్వశి : బాక్
రంభ : కింగ్ డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
మేనక : ప్రసన్నవదనం
అప్సర : కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
కుమారి : రత్నం

నామవరం

వీఎస్ మహల్ : కృష్ణమ్మ, ప్రతినిధి–2


ధవళేశ్వరం

మురళీకృష్ణ : కృష్ణమ్మ, కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్

కడియం

వెంకటసూర్య : ఆ ఒక్కటీ అడక్కు

రైతులకు చేరేలా కార్యక్రమాలు రూపొందించాలి



బైపాస్ ఫ్యాట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శేషుమాధవ్, ముత్తురామన్ తదితరుల

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కృషి విజ్ఞాన కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలు, టెక్నాలజీలు రైతులకు చేరేలా ఉండాలని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ) ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. స్థానిక సీటీఆర్ఐ సమావేశ మందిరంలో గురువారం కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రీయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాగంటి శేషుమాధవ్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందే విధంగా రైతులకు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించాలని కోరారు. హైదరాబాద్ భారత వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.ముత్తురామన్ మాట్లాడుతూ పసుపు, మిరప, ఆముందం, అశ్వగంధ మొదలైన పంటలపై ప్రదర్శనలు, క్షేత్రస్థాయి పరిశీలనలను చేపట్టాలని సూచించారు. కేవీకే హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు సేద్య పంటలు, పశువిజ్ఞాన విభాగాల గత సంవత్సర ఫలితాలను, రాబోయే సంవత్సరం (2024)లో చేపట్టవలసిన కార్యక్రమాలను సభ్యులకు తెలిపారు. ఉద్యాన పంటల అధికారి జీవీఆర్ సత్యవాణి, సస్యరక్షణ అధికారి టి.విజయ వర్ధన్ ఆయా విభాగాల ఫలితాలను ప్రజెంట్ చేశారు. ఈ సందర్భంగా బైపాస్ ఫ్యాట్ (అన్నాశయ రక్షిత కొవ్వు) అనే పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా ఉద్యాన పంటల అధికారి బి.సుజాత కుమారి, ఎస్వీ యూనివర్సిటీ పశుసంవర్ధక విభాగం హెడ్ డాక్టర్ బి.ఈశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి డా.కృష్ణారావు, రాజమండ్రి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ నరసింహారావు పాల్గొన్నారు.